క్లుప్తంగా

పన్నుల వసూలు వేగవంతం చేయండి



సచివాలయ కార్యదర్శుల సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పట్టణ పరిధిలోని సచివాలయ కార్యదర్శులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి రెండు వార్డులకు ఒక సచివాలయం ఉండడంతో కార్యదర్శుకు ఇళ్ల యజమానులను నిత్యం కలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు అడ్మిన్‌లు, వెల్ఫేర్ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు సంయుక్తంగా పన్నుబకాయిదారుల వద్దకు వెళ్లి వసూలు చేయాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో బకాయిల వసూలుకు సంబంధించి లక్ష్యాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వీటిని జనవరి 31 నాటికి 100 శాతం వసూలు చేయాలని సూచించారు. ఈ మేరకు సచివాలయాల వారీగా కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి నూకరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లికి నేతల అభినందనలు



బాబీని అభినందిస్తున్న నేతలు

పిఠాపురం: ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేయాలని, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు గండేపల్లి రామారావు (బాబీ) అన్నారు. ఇటీవల ఆయన పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం మండలం నర్సింగపురానికి చెందిన పార్టీ రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి ఉలవల భూషణం ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నరసింగపురం నేతలు కొల్లం చంద్రశేఖర్, వరికూటి శేషరావు, బుర్తి కుమార్, సీకోలు యేసు, అభిమానులు నాయకులు పాల్గొన్నారు.

25 నుంచి ట్రేడ్ యూనియన్ మహాసభలు



మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

సామర్లకోట: సీఐటీయూ ట్రేడ్ యూనియన్ మహాసభలు ఈనెల 25, 26 తేదీలలో పెద్దాపురంలో జరుగుతాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం మహాసభల కరపత్రాలను యాసలపు సూర్యారావు భవనంలో యూనియన్ అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐటీయూ పోరాడుతుందన్నారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ, కార్మికులను సమీకరించడంలో సీఐటీయూ ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ మేరకు పెద్దాపురంలో రెండు రోజుల పాటు జరిగే మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ సంఘాల నాయకులు వడ్డి సత్యనారాయణ, గునురి రమణ, తైలా శ్రీను, పద్మ, తాడిశెట్టి గంగ, సిరిపరపు శ్రీనివాసు, జి.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

22 మద్యం దుకాణాల్లో తనిఖీలు

ఎక్సైజ్ సీఐ దుర్గార్జునరావు



మద్యం దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సామర్లకోట: పెద్దాపురం ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని 22 మద్యం దుకాణాలను మంగళవారం తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కేవీ దుర్గార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ మద్యంపై 'సాక్షి'లో వచ్చిన కథనంతో తమ సిబ్బందితో తనిఖీలు చేశామన్నారు. అయితే ఎక్కడా నకిలీ మద్యం లభించలేదని తెలిపారు. అదే విధంగా నేర ప్రదేశాలుగా గుర్తించిన ప్రాంతాలలోను తనిఖీ చేయగా కల్తి మద్యం తయారీ జాడలు కనిపించలేదన్నారు. నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసినా, తయారు చేస్తున్నట్లు తెలిసిన వారు పెద్దాపురం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు.

లక్షలు వ్యయం.. లక్ష్యం శూన్యం

- నిరుపయోగంగా పంచాయతీ ట్రాక్టర్
- ప్రైవేటు స్థలంలో వదిలేసిన వైనం
- గ్రామంలో కుంటుపడిన పారిశుధ్యం
- చెత్త నుంచి సంపద కేంద్రంలో కంపోస్టు తయారీ నిల్
- పట్టించుకోని అధికారులు



ప్రైవేటు స్థలంలో ఉన్న పంచాయతీ ట్రాక్టర్



నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రం



గాలి తీసేయడంతో అణిగిపోయిన ట్రాక్టర్ చక్రం



ఖళీగా ఉన్న బ్యాటరీ బాక్స్



తుప్పపడుతున్న ట్రాక్టర్ ట్రక్కు

కొత్తపల్లి: గ్రామ పంచాయతీ పారిశుధ్య నిర్వహణ కోసం ఒక ప్రైవేటు పరిశ్రమ లక్షలు వెచ్చించి అందించిన ట్రాక్టర్ నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మూలపడింది. అరబిందో ఫార్మా ఫౌండేషన్ అందించిన ఈ ట్రాక్టర్‌ను మండలంలోని కొత్త మూలపేట గ్రామంలో పారిశుధ్య పనులకు అప్పగించారు. కొద్ది రోజులు ఆ ట్రాక్టర్‌ను వినియోగించి అనంతరం కొన్ని నెలలుగా వినియోగించకుండా ప్రైవేటు స్థలంలో వదిలివేయడంతో కొందరు ట్రాక్టర్ బ్యాటరీని తొలగించి, చక్రాలలో గాలిని తీసేశారు. ఎండకు ఎండి వానకు తడుస్తూ ట్రాక్టర్ ట్రక్ తుప్పుపడుతోంది. ట్రాక్టర్ లేకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు రిక్షాలతో తరలిస్తున్నారు. రూ.లక్షలు విలువ చేసే ట్రాక్టర్‌ను నిరుపయోగంగా వదిలివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ వద్ద ఉండాల్సిన ట్రాక్టర్ ప్రైవేటు స్థలంలో ఉండడం పైనా, దాని తాళాలు ఎవరి వద్ద ఉంటాయనే విషయం పైనా పంచాయతీ కార్యదర్శి సాయి కిరణ్ వివరణ కోరగా తాను జూన్ నెలలో బాధ్యతలు చేపట్టానని, తనకు ట్రాక్టర్ బాధ్యతలు అప్పగించలేదని, దాని వివరాలు తనకు తెలియదని పేర్కొన్నారు.

ఎంపీడీఓ లక్ష్మీరెడ్డిని వివరణ కోరగా దీనిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తానని పేర్కొన్నారు. పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ఎవరి వద్ద ఉన్నా స్వాధీనం చేసుకుంటామని, పంచాయతీ ట్రాక్టర్ ఇతరుల వద్ద ఉండడం నేరమన్నారు.

కుంటుపడిన పారిశుధ్యం

గ్రామంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం కుంటుపడింది. డ్రైనేజీలు పూడుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల బాధ భరించలేకపోతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా సంపద కేంద్రం

గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా సేకరించకపోవడంతో కంపోస్టు ఎరువు తయారీలో అధికారులు ఆసక్తి చూపకపోవడంతో చెత్త నుంచి సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు మాధవపట్నం విద్యార్థులు



విద్యార్థులను అభినందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



రెవెన్యూ డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం టి.మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఏదో ఒక క్రీడలో రాణించి పాఠశాలకు పేరు తీసుకువచ్చారన్నారు. రగ్బీలో అండర్-17 బాలుర విభాగం నుంచి డి.సాయితేజ, బాలికల విభాగం నుంచి పి.హాసిని, అండర్-14 బాలుర విభాగంలో డి.ప్రేమ్‌కుమార్, బాలికల విభాగంలో పి.జనని, పి. హేమవర్షిణి ఎంపికయ్యారన్నారు. అలాగే హ్యాండ్ బాల్ అండర్ 14 బాలుర విభాగంలో పి.జయసత్య సూర్య, బాలికల విభాగంలో వీర వైష్ణవి, అండర్-17 హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో పి.మంజుప్రియ, అండర్-17 మోడ్రన్ పెంటాథ్లాన్ బాలుర నుంచి ఎస్.యుగేష్, రెజ్లింగ్ అండర్-19 బాలుర విభాగంలో డి.సోమరాజు ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం, పీడీ గోవింద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొని అభినందించారు.

డివిజన్ స్థాయి పోటీలకు బీబీఆర్ విద్యార్థులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రెవెన్యూ డివిజన్ పోటీలకు బీబీఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎం లలితా మాణిక్యాంబ, పీడీ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. వాలీబాల్ అండర్-14 విభాగంలో డి-భవాని, యు.కల్యాణి, అండర్-17 విభాగంలో వై.మంజుల, అండర్-14 ఖోఖోలో టి.శశికళ, పి.శ్రీనివాసు, అండర్-17 విభాగం 100, 400 మీటర్ల పరుగు పందెంలో ఎ.దుర్గాగణేష్, 1500 మీటర్ల పరుగు పందెంలో వై.అశ్వినీ, ఎస్.సత్యశ్రీ, షాట్‌పుట్‌లో ఎ దేవిమీనాక్షి ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాల నుంచి మొదటిసారిగా డివిజన్ స్థాయికి విద్యార్థులు ఎంపిక కావడానికి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు కృషి ఎంతో ఉన్నదని హెచ్‌ఎం పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ దుర్గారాణి

కొత్తపల్లి: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. మండలంలోని వాకతిప్ప జెడ్పీ పాఠశాలలో మంగళవారం పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఏటా అక్టోబర్ 11న నిర్వహించే అంతర్జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా ఒక అంశంపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఏడాది 'బాలికగా నాతోనే మార్పు - రండి ముందుకు' అనే అంశంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు, వివక్షపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమాన్ని ఈ నెల 18 తేదీ వరకూ నిర్వహించి, బాలికలకు వ్యాస రచన, ఆటల పోటీలు పెట్టి బహుమతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సారమ్మ, పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం సీహెచ్‌వీవీ కృష్ణమూర్తి అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.రమణమ్మ, ఎస్.ధనలక్ష్మి, సీహెచ్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పేద ప్రజలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యం అక్రమ రవాణా అవుతోందన్న సమాచారం మేరకు పోలీసులు ఏలేశ్వరం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, స్థానిక రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా గొల్లప్రోలు 216 జాతీయ రహదారిలో బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా దానిలో 3780 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాటి విలువ రూ.1,73,880 ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ బియ్యాన్ని తరలిస్తున్న పిఠాపురం మండలం బి. ప్రత్తిపాడుకు చెందిన నందిపాటి వీరబాబు అనే వ్యాన్ డ్రైవరును అదుపులోకి తీసుకున్న అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టాక్ పాయింట్‌కు అప్పగించారు. నిందితుడి వాహనాన్ని గొల్లప్రోలు పోలీసులకు అప్పగించారు.

పోర్టుల్లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



యాంకరేజ్ పోర్టులో భద్రతా చర్యలపై చర్చిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ రూరల్: కాకినాడ సీ పోర్టు, యాంకరేజ్ పోర్టులను జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు పోర్టుల్లో పలు విభాగాలను సందర్శించి భద్రతా చర్యలపై సమీక్షించారు. రికార్డులు పరిశీలించారు. యాంకరేజ్ పోర్టు పరిధిలోని చెక్ పోస్టుల పనితీరుపై ఆరా తీశారు. సిబ్బందిని కలిసి, భద్రతా అంశాలపై దృష్టి సారించారు. చెక్ పోస్టు సిబ్బందికి భద్రత, విజిలెన్స్, రికార్డు నిర్వహణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఎస్సై పి.పవన్ కుమార్, సిబ్బందికి కూడా పలు సూచనలు ఇచ్చారు. సీ పోర్ట్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ జాకబ్ సత్యరాజు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యనారాయణలు భద్రతా చర్యల గురించి ఎస్పీకి వివరించారు. పోర్టు భద్రతను మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పరికరాలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, అలర్ట్ రెస్పాన్స్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వారికి ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, ఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామ సభ



వాకతిప్పలో గ్రామ సభ నిర్వహిస్తున్న ఏపీఓ తదితరులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామ సచివాలయం వద్ద వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాలకు సంబంధించి మంగళవారం ఉపాధి పథకం 2026-27 సంవత్సరానికి గ్రామసభ నిర్వహించారు. చేపట్టనున్న నూతన పనులను గుర్తించడంపై పథకం ఏపీఓ కొండలరావు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఉపాధి పనులకు శ్రామికులు రాకపోయినా మస్తర్లు వేయడం, పనికి వచ్చి గట్టుపై కూర్చుని పని చేయకపోవడంపై, మస్తరు వేయించుకుని పని చేయకుండా వచ్చేయడంపై పలువురు శ్రామికులు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు పాలాని దొరబాబు, కర్రి చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

కొత్తపల్లి: ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన రావాడ పద్మకుమారి డ్వాక్రా సంఘంలో అవకతవకలు జరిగాయని డ్వాక్రా వీఓఏను ప్రశ్నించింది. దీంతో వీఓఏ కుటుంబ సభ్యులు తనను కొట్టడానికి వచ్చారని పద్మకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన డ్వాక్రా వీఓఏ దల్లి అపర్ణ తనపై కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఇరువురి ఫిర్యాదుల మేరకు ఎస్సై వెంకటేష్ కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

17న జాబ్‌మేళా

బాలాజీచెరువు: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. శ్రీ గోపాల్ ఆటోమొబైల్ 26, అపోలో ఫార్మసీ 200, ఎస్‌బీఐ గ్రూప్ 130, టీమ్‌లీస్ సంస్థ 300 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. పదో తరగతి, అపైన ఉత్తీర్ణులైన విద్యార్థులు హాజరు కావచ్చని, ఇతర వివరాలకు 86398 46568 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

నిర్మాణానికి నాలుగేళ్లు..

ప్రారంభానికి మీనమేషాలు!

- జేఎన్టీయూకేలో పూర్తయిన పీజీ హాస్టల్
- విద్యార్థులకు అందుబాటులోకి రాని వైనం
- అసౌకర్యంతో విద్యార్థుల అవస్థలు
- రేపు, మాపు అంటున్న అధికారులు



పూర్తయిన పీజీ హాస్టల్ భవనం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ కళాశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులకు వసతి గృహం ఆశలు ఆవిరయ్యాయి. భవన నిర్మాణం పూర్తయ్యి ఏడాది గడిచినా నేటికి దానిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురాలేదు. గత ప్రభుత్వ హయాంలో నిధులు విడుదలై ప్రారంభానికి వీలుగా పనులు వేగవంతం చేసినా నేటికి దాని ప్రారంభించడానికి సన్నాహాలు చేయలేదు. కళాశాలలో మొదట కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకు మాత్రమే వసతి సదుపాయం ఉండేది. ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ వంటి పీజీ కోర్సులకు కేవలం తరగతులు తప్ప వసతి సదుపాయం లేకపోవడంతో వారు ప్రైవేట్ హాస్టళ్లపై ఆధారపడుతున్నారు. దీంతో దాదాపు 300 వరకూ ఉండే పీజీ విద్యార్థులు చాలా అవస్థ పడేవారు. ముఖ్యంగా మహిళలకు చాలా అసౌకర్యంగా ఉండేది. పీజీ కోర్సులలో చేరిన మహిళా విద్యార్థులలో ఏడాదికి ఐదు నుంచి పది వరకు డ్రాపౌట్స్ ఉండేవి. హాస్టళ్లు సరిపడక చివరకు స్టూడెంట్ ఎమినిటీ భవనం పై అంతస్తులో ఉన్న క్యాంటిన్ హాల్, గదుల్ని విద్యార్థుల వసతికి వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యపై గతంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి అప్పటి రూసా కో-ఆర్డినేటర్‌గా ఉన్న మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు దృష్టి పెట్టారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 12, 13వ పంచవర్ష ప్రణాళికలలో భాగంగా రూసా పథకం ద్వారా వర్సిటీకు రూ.20 కోట్లు వచ్చాయి. ఈ పథకం ఉన్నత విద్యలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రవేశపెట్టినది. ఈ నిధులతో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మంత్రులచే శంకుస్థాపన చేయడంతో పాటు పనులు వేగవంతం చేశారు. దీంతో విద్యార్థులకు నూతన భవనాలు, ఆధునిక వసతి కల్పనకు మరింత ఊతం ఇచ్చింది.

రూసా నిధులలో కేంద్రం రూ.12 కోట్లు, రాష్ట్ర వాటా రూ.8 కోట్లు కలిపి రూ.20 కోట్లతో వర్సిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. తొలి విడతగా రూ.10 కోట్లు విడుదల చేశారు. వీటిలో ఆరు కోట్లతో వసతి భవనాలు, నాలుగు కోట్లతో పాత భవనాల ఆధునీకరణ, ఆధునిక పరికరాలు తదితరవాటికి వినియోగించారు. అంతేగాక వర్సిటీలో దాదాపు రూ.50 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ, స్నాతకోత్సవ భవనాలు దాదాపు 75 శాతం పూర్తిచేశారు.

నవంబర్‌లో అందుబాటులోకి..



పీజీ హాస్టల్ భవనం వచ్చే నవంబర్‌లో విద్యార్థులకు అందుబాటులోకి తేచ్చేలా చర్యలు తీసుకుంటాం. రూసా నిధులు కావడంలో బిల్లులు అప్‌లోడ్ సమస్య వల్ల కాంట్రాక్టర్‌కు బిల్లు రాలేదు. ఈ వారంలో సమస్య పరిష్కరించి నవంబర్‌లో ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

– ఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూకే

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లకు ఐదో విడతలో భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఎంవీజే వర్మ మంగళవారం తెలిపారు. ఏదైనా అన్‌లైన్ సెంటర్ ద్వారా ఈ నెల 16వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారు అదే సాయంత్రం 6 గంటల్లోగా కాకినాడ ఐటీఐలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులకు 17వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కాకినాడ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు కల్పించనున్నట్టు తెలిపారు.

జేసీ మీనాకు ఘన వీడ్కోలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ కార్యాలయంలో ఉన్న పీజీఆర్ఎస్ భవనంలో మంగళవారం రాత్రి ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ జి.బిందు మాధవ్, ట్రైనీ కలెక్టర్ మనీష, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, ఎం.శ్రీరమణిలతో పాటు పలువురు జిల్లా అధికారులు, కాకినాడ జిల్లాలో ఉన్న తహసీల్దార్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కళాశాల సీనియర్ అసిస్టెంట్‌కు అభినందన



పల్లా సురేష్ కుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

పిఠాపురం: ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ పల్లా సురేష్ కుమార్‌ను కళాశాల సిబ్బంది మంగళవారం అభినందించారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను పూలమాలలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు సిబ్బంది పాల్గొన్నారు.